


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 11-07-2025 సంపుటి : 07 సంచిక : 60 పేజీలు : 8 వెల : రూ 3-00


# కార్పోరేట్‌కు ధీటుగా సర్కార్ బడులు : సింఎ బాబు



పుట్టపర్తి, జులై 10: రెండోసారి ఘనంగా మెగా పీటీఎం కార్యక్రమం జరుపుకోవడం ఒక చరిత్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కొత్తచెరువు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పీటీఎం సమావేశంలో సీఎం పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు పాఠం చెప్పారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కొత్త చెరువు జెడ్పీ హై స్కూల్ ఆధునికదేవాలయమని..జ్ఞానాన్నిఅందించేపుణ్యక్షేత్రమని చెప్పుకొచ్చారు. ఇక్కడ చదుకున్న పూర్వ విద్యార్థులు తమ వంతుగా పాఠశాలను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. 'నా టీచర్‌ను ఎప్పుడూ మరిచిపోలేదు. 1978లో నేను ఎమ్మెల్యే అయ్యాను. రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల ఏనాడు పేరెంట్స్ మీటింగ్‌కు వెళ్లలేదు. నారా లోకేష్ చదువు బాధ్యతను నా సతీమణి తీసుకుంది' అని తెలిపారు.

**ఆ పాఠశాలల్లో నో వేకెన్సీ..**ఆడ బిడ్డల కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చానని.. రిజర్వేషన్‌లలో మహిళకు పెద్ద పీట వేశానని గుర్తుచేశారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం డబ్బులు ఇచ్చి చదువు చెప్పించే బాధ్యత తనది అని స్పష్టం చేశారు. నారా లోకేష్ విద్యా శాఖను ఏరికోరి మనస్ఫూర్తిగా తీసుకున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ స్కూల్స్‌కు ధీటుగా అభివృద్ధి చేసే బాధ్యత తనది అని తెలిపారు. నెల్లూరు జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో నో వేకెన్సీ అని బోర్డులు పెట్టారని.. ఇది చూసి చాలా సంతోషంగా అనిపించిందని హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే అన్ని పాఠశాలల్లో కనపడాలని సీఎం అన్నారు.

**లోకేష్‌కు అభినందనలు..**లీప్ యాప్‌ను తల్లిదండ్రులు డౌన్ లోడ్ చేసుకోవాలని... ఎవరైనా పిల్లలు స్కూల్‌కు దుమ్మా కొడితే పదిన్నర గంటలకే పేరెంట్స్‌కు మెసేజ్ వెళ్తుందన్నారు. లీప్ యాప్‌ను రూపొందించిన మంత్రి లోకేష్‌ను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. పిల్లల స్కూల్ బ్యాగ్‌లపై గత ప్రభుత్వంలో బొమ్మలు వేసుకున్నారని.. బడుల్లో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం స్కూల్స్‌లో మధ్యాహ్న బోజనం రద్దు చేసిందన్నారు. విద్యార్థి దశలో అన్నం పొట్లం కట్టుకొని వాగులు వంకలు దాటుకొని నడుచుకుంటూ బడికి వెళ్లే వాడినని గుర్తుచేసుకున్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని... సన్న బియ్యంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు ముఖ్యమంత్రి.

**వాటికి దూరం కాకపోతే సంక్షేమ పథకాలు కట్...**ఎవరైనా గంజాయి సాగు చేసినా అమ్మినా అదే వారికి చివరి రోజు అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. గంజాయికి దూరం కాకపోతే సంక్షేమ పథకాలు కట్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. తల్లి పట్ల భక్తి భావం పెరగాలని తల్లికి వందనం పేరు పెట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఒక్క టీచర్‌ను కూడా నియమించ లేదని విమర్శించారు. బాత్రూంలో ఫోటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసి వేధింపులకు గురి చేశారని... వాటిని రద్దు చేశామని చెప్పారు. ఆగస్టు లోపల డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసి టీచర్స్ బడికి వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. 1995 ఆగస్టు 15 తేదీన మిడ్ డే మీల్స్ కార్యక్రమం ప్రారంభించామని.. విద్యార్థులకు ప్రతిభా అవార్డ్స్ ఇచ్చామన్నారు. పిల్లలకు ఎకరా రెండు ఎకరాలు ఆస్తి ఇవ్వడం కాదని.. బాగా చదివిస్తే కుటుంబం, సమాజం బాగుపడుతుందని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులను వారికి నచ్చిన కాలేజీలో చదువుకునేలా చూడాలని విద్యా శాఖ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# నా కుమారులను రక్షించండి.. మహిళ వినతి.. స్పందించిన పవన్



అమరావతి, జులై 10: ఎవ్వరు ఎలాంటి ఆపదలో ఉన్నా, తమకు సహాయం చేయండి అని అర్థిస్తే చాలు వెంటనే స్పందిస్తారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల తీవ్ర కష్టాల్లో ఉన్న నటి పాకీజాకు డిప్యూటీ సీఎం ఆర్థిక సాయం అందించారు. ఇలా ఎంతో మందికి.. అనేక విధాలుగా సహాయం అందించారు ఉపముఖ్యమంత్రి. ఇప్పుడు తాజాగా ఓ మహిళ కష్టం చూసి చలించిపోయారు. ఆ మహిళ సమస్య విన్న వెంటనే తక్షణమే స్పందించారు డిప్యూటీ సీఎం.మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఓ మహిళ వినతి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం.. ఈ సమస్యను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలని పవన్‌ను విజయనగరానికి చెందిన గండబోయిన సూర్యకుమారి అనే మహిళ కోరారు. మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్న తమ వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, వారిని విడిపించేందుకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.తమ ఇద్దరు కుమారులతో పాటు 8 మంది మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో ఉన్నట్లు డిప్యూటీ సీఎంకు మహిళ చెప్పారు. దీనిపై వెంటనే స్పందించిన పవన్.. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న వారిని రక్షించాలని కోరారు. ఈ వ్యవహారంపై విదేశీ వ్యవహారాల శాఖ సానుకూలంగా స్పందించింది. విదేశాల్లో మగ్గుతున్న వారిని వెనక్కి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం పవన్‌కు విదేశీ వ్యవహారాల శాఖ హామీ ఇచ్చింది.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లేలా తల్లిదండ్రులు మార్గనిర్దేశం చేయాలి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 10-ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు.నంద్యాల జిల్లా ఆత్మకూరు డివిజన్ వెలిగోడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీట్ 2.0 కార్యక్రమానికి జిల్లా కలెక్టరు రాజకుమారి గణియా హాజరయ్యారు.ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి పొందిన తల్లులు విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి. హాజరు మార్కుల వివరాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. బాగా చదివి మార్కులు పెంచుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. పాఠశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాల పైన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల అంతా కలియ తిరిగి తరగతి గదులను, పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మెగా పీటీఎం 2.0 లోగోతో ఫోటోలు దిగారు. అలాగే విద్యార్థులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆలోచన, విద్యాశాఖ మంత్రి గారి ఆశయం మేరకు జిల్లాలో 1959 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 3.14 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. ఈ పాఠశాలలన్నిటిలో మెగా పిటిఎం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. వీటితోపాటు 149 కళాశాలల్లో కూడా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. మన ఎదుగుదలను కోరుకునేది మన గురువులే. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లేలా తల్లిదండ్రులు మార్గనిర్దేశం చేయాలి. . అనంతరం మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించి, విద్యార్థుల అందరితో కలిసి భోజనం చేశారు. అంతకుముందుగా ప్రారంభంలో విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# స్కూళ్లలో నో పాలిటిక్స్.. అంతా బయటే: మంత్రి లోకేష్

పుట్టపర్తి, జులై 10: గురు పౌర్ణమి నాడు పుట్టపర్తిలో మెగా పీటీఎమ్ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. పుట్టపర్తిలోని కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. అమ్మంటే రెండు అక్షరాలు కాదని.. అమ్మను గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తాను విద్యాశాఖ మంత్రి అవగానే ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలు ఉండవని.. బడి గేటు బయటనే



పాలిటిక్స్ అని చెప్పుకొచ్చారు.స్కూల్ నుంచి పిల్లలు ఇంటికి వచ్చాక చదువుపై పేరెంట్స్ బాధ్యతగా ఉండాలని సూచించారు. అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారని.. విద్యాశాఖ ఆధ్వర్యంలో కోటి మొక్కలు నాటుతామని వెల్లడించారు. ప్రతి మొక్కకు గ్రీన్ పాస్ పోస్ట్ ఇస్తున్నామని తెలిపారు. గ్రీన్ పాస్ పోస్ట్ ద్వారా మొక్క పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు.

# గురు పౌర్ణిమ సందర్భంగా ప్రముఖ యోగా గురువు వెంకటాద్రి గారికి ఘన సన్మానం









విభారె న్యూస్::ఆళ్లగడ్డ ::ఆళ్లగడ్డ పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి ఆవరణంలో గురు పౌర్ణిమ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు శ్రీ వెంకటాద్రి గారిని ఆయన శిష్యులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో యోగాభ్యాసము ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని ప్రతిదినముయోగాభ్యాసం చేయుట ద్వారా ఎన్నో రకాల జబ్బులను దూరం చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అనేకమంది పట్టణ ప్రముఖులు యోగా గురువు వెంకటాద్రి గారి విలువైన సేవలను కొనియాడారు. ఒకవైపు ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తూ, క్రమం తప్పకుండా ప్రతిరోజు యోగ విద్యను బోధిస్తూ మార్గదర్శకంగా నిలిచారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి యోగా గురువు ధన్యవాదాలు తెలిపారు.

# సంపాదకీయం

శుక్రవారం 11-07-2025

## జనాభా నియంత్రణ తక్షణావశ్యకత !

ప్రతి ఏటా జూలై 11వ తేదీన 'ప్రపంచ జనాభా దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు. ప్రపంచ జనాభా ఇప్పటికే 800 కోట్లు దాటింది. భారతదేశ జనాభా అధికారికంగా 140కోట్లకు చేరుకుంది. ఇందులో పెరుగుదలే తప్ప తక్కు ఉండదని చెప్పొచ్చు. జనాభా పెరుగుదలతో పాటు కనీస వసతులు, వనరులు లేకపోవడంతో భారతదేశం ఇంకా పేదరికంలోనే మగ్గుతోంది. ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలకు, తరుగు దలకు సంబంధించిన విషయాల గురించి ప్రజలలో చైతన్యం తెచ్చేందుకుగాను ఐక్యరాజ్యసమితి 1989వ సంవత్సరంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించింది. జనాభా నియంత్రణ అన్నది ఎవరికి వారు నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది. ఆయా దేశాలు తమ దేశాల వనరుల ఆధారంగా నియంత్రణ చర్యలు పాటించాలి.నియంత్రణ లేకపోవడంతో ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగి పోతున్నది. పెరిగిన జనాభా వలన పలు ప్రపంచ దేశాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రజలకు కనీస మౌలిక సదుపా యాలు కల్పించ లేక సతమతమ వుతున్నాయి. విద్య,వైద్యం,ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుధ్యం వంటి అనేక అంశాల్లో ప్రభుత్వాలు ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాయి. పెరుగుతున్న జనాభా కారణంగా కనీస వసతుల కల్పన ఏ ప్రభుత్వాని కైనా తలకుమించిన భారంగా మారుతోంది. గృహకల్పన, అక్షరాస్యత, నిరుద్యోగం, పౌష్ఠికాహారం, ఉద్యోగ కల్పన వంటి అంశాలు విషమ సమస్యలుగా మారాయి. ప్రకృతి వైపరీత్యాలతో అనేక దేశాలు సతమతమవు తున్నాయి. చాలా దేశాల్లో ఈనాటికీ కనీస విద్య గగకుసుమంలా మారింది. ఆహార సమస్యతో అనేక దేశాలు అలమటిస్తున్నాయి. మనదేశంలో త్వరలోనే జగనగణన జరుగనుంది. ఈ క్రమంలో ఈ వానాకాల పార్లమెంట్ సమావేశంలో మన ప్రతినిధులు దీనిపై చర్చించాలి. ఇప్పటికే 140 కోట్లకు జనాభా చేరుకున్న క్రమంలో జనాభా నియంత్రణపై దృష్టి సారించాలి. లేకుంటే భారతదేశ వనరులు బతకడానికి సరిపోవు. జనభా నియంత్రణపై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చైనాలాగా జనాభా నియంత్రించకపోతే రానున్నరోజుల్లో బతకడం దుర్లభంగా మారనుంది. చాలా దేశాలు దీన్ని పట్టించుకోక పోవడం వల్ల అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. జన విస్ఫోటనంతో ఎన్ని రకాల విపరీత పరిణామాలు జరగాలో అన్నీ జరుగుతన్నాయి. పర్యావరణ విపరీత పరిస్థితుల కారణంగా అధిక వర్షాలు లేదా, అస్సలు వర్షాలు పడక పోవడం, వనరులన్నీ తగ్గిపోవడం వంటి విపరీత పరిణామాలు చూస్తున్నాం. ఆహారధాన్యాల కొరత ఏర్పడనుంది. ప్రకృతి విధ్వంసం జరిగింది. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ఇలా ఎన్నో విపరీత పరిణామాలు చూస్తున్నాం. అవన్నీ అనుభవంలోకి స్తున్నాయి. ఎన్ని దుష్ప్రభావాలు కలగాలో కలుగుతున్నాయి. ఉన్న వనరుల విధ్వంసం జరిగింది. జనాలకు సరిపడా ఆహారధాన్యాలు అందడం లేదు. పంటలు తక్కువ....తినేవారు ఎక్కువయ్యారు. నిరుద్యోగం తాండవిస్తోంది. నానాటికి ప్రపంచంలో జనాభా పెరుగుతోంది. నానాటికి పెరుగుతున్న జనాభా..తద్వారా తలెత్తే దుష్పరి ణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు పూనుకోవాలి. పల్లెలు, పట్టణాలు, నగరాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. హోటళు ్ళ, సినిమా హాళ్ళు, షాపింగ్ మాల్స్, కూరగాయల మార్కెట్లు, హాస్పటల్స్.. ఇలా ఒకటేమిటి బ్యాంకుల నుండి బట్టల దుకాణాల వరకు ఎక్కడ చూసినా జనం. ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో ప్రతీ ప్రాంతం కిటకిట లాడుతున్నది. దీంతో నివాస స్థలాలు కూడా భారంగా మారయి. ఇల్లు అందరికీ హక్కు అన్నది పోయి అదో కలగా మిగిలింది. అగ్ర రాజ్యాలు సైతం ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి... అన్నింటికి మించి ఆరోగ్య రంగంలో ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రపంచంలోని అనేక దేశాలు వెనుకబడి ఉన్నాము. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సహస్రాబ్ది లక్ష్యాలను కూడా చేరుకోలేదు. అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యానికి ఇంకా దూరంగా వుండడానికి అధిక జనాభాయే కారణం. అయితే కొన్ని అంశాలలో అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని చెప్పుకుంటున్నా...నేటికీ సామాన్యులకు అది కలగానే మిగిలింది. ఫార్మా, వ్యాక్సిన్ల రంగాల్లో ముందంజ వేస్తున్నా..జనాభాకు సరిపడా అందించలేని దుస్థితిలో ప్రపంచం ఉంది. మొత్తం మీద అధికా జనాభా ప్రధానంగా ఆరోగ్యరంగం అసమానతలకు కారణంగా మారింది. ఆధునిక జీవన శైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్లతో మూడు ప్రధాన సమస్యలు మానవాళిని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం రక్తపోటు, షుగర్ అనేవి చాలా సాధారణంగా మారిపోయాయి. కేవలం నగరాలు, పట్టణాలు కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. కేవలం పని ఒత్తిడి కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయన్నది సుస్పష్టం. సరైన ఆహారం తీసుకోకపోవడం, చిన్నారులు ఎక్కువగా ఎలక్ట్రానిక్ పరికరాలకు అలవాటు పడడం కారణాలుగా ఉ న్నాయి. భారతదేశంలో ఊబకాయం కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దీని కారణంగా ప్రజలు తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఊబకాయం అనేది చిన్న సమస్య కాదని, ఇది ఒక వ్యాధిగా వృద్ధి చెందుతుందని చెప్పింది. స్థూలకాయం అంటే శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉండట మని నిర్వచించారు. ఆకలిని అధిగమించేందుకు అడ్డమైన గడ్డీ తినడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వారికి సకాలంలో వైద్యం అందించాలన్నా ఖరీదుగా మారింది. ప్రపంచంలో జనాభా పెరుగుదలను కట్టడి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వాలు లేకపోవడం ఈ దారుణానికి కారణంగా చూడాలి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, జనాభా నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. దీంతో పెరుగుతున్న జనాభాతో వనరులపై తీవ్ర ప్రభావం పడుతోంది.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేపై అధిష్టానానికి భార్య, కుమార్తె ఫిర్యాదు

బెంగళూరు: చన్నపట్టణ కాంగ్రెస్ ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్‌కు వ్యతిరేకంగా భార్య, కుమార్తెలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. కేపీసీసీ కార్యాలయంలో బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలాను వారు భేటీ అయ్యారు. యోగేశ్వర భార్య మాళవిక సూలంకి, కుమార్తె నిశాలు ఫిర్యాదు చేశారు. తమ కుటుంబాన్ని తరచూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. పదే పదే కోర్టుల్లో కేసులు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. చట్టపరంగా తాము దూరం కాలేదని, అయినా మానసికంగా హింసిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తమకు ఇబ్బంది కలిగించకుండా ఉంటే చాలంటూ విన్నవించారు. సీపీ యోగేశ్వర్ బీజేపీలో కొనసాగుతున్నప్పుడే కుమార్తె నిశా కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్‌ను భేటీ అయిన విషయం తెలిసిందే.అప్పట్లోనే నిశా కాంగ్రెస్ లో చేరే ప్రయత్నం చేశారు. అందుకు డీకే శివకుమార్ స్పందించి తండ్రికి వ్యతిరేకంగా పోరాటం సరికాదని, పెళ్లి కావాల్సి ఉందని మందలించారు. యోగేశ్వర్ బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి చన్నపట్టణ నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు.

## కుంభాభిషేకాల్లో సీఎం ఎందుకు పాల్గొనడం లేదు...

**- బీజేపీ సీనియర్ నేత తమిళిసై**



చెన్నై: ఆలయాల కుంభాభిషేకంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఎందుకు పాల్గొనడం లేదని మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్‌ప్రశ్నించారు. రాణిపేట జిల్లా షోలంగర్‌లోని యోగ నృసింహ్వామి ఆలయ కుంభాభిషేకంలో కుటుంబ సభ్యులతో తమిళిసై పాల్గొన్నారు. తొలుత రోప్ కార్ ద్వారా కొండ ఆలయానికి వెళ్లిన తమిళిసైకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ...57 సంవత్సరాల తర్వాత నిర్వహించిన యోగ నృసింహస్వామి కుంభాభిషేకంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పలు ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు చేపట్టి, కుంభాభిషేకాలు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.అదే సమయంలో, ఆలయ కుంభాభిషేకాల్లో ముఖ్యమంత్రి ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. రంజాన్, క్రిస్మస్ పండుగలకు శుభాకాంక్షలు తెలిపే సీఎం స్టాలిన్, హిందువుల పండుగలకు శుభాకాంక్షలు చెప్పకపోవడం సమంజసం కాదన్నారు. షోలింగర్ కొండలపై చెట్లు నరికే ఘటనలు అడ్డుకోవాలని తమిళిసై డిమాండ్ చేశారు.

## ప్రజా సంక్షేమం ధ్యేయం గా కాంగ్రెస్ పాలన

**ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్**




హైదరాబాద్:సీఎం రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం ప్రజా ప్రతినిధుల కార్యక్రమంలో పాల్గొన్నానని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కుమార్ అన్నారు.ప్రతిరోజూ ప్రజా ప్రతినిధుల బృహత్తర కార్యక్రమము చేపట్టినందుకు ముఖ్యమంత్రికి, టీపిసిసిచీఫ్ కి ప్రత్యేక ధన్యవాదాలన్నారు.వినోద్ కుమార్ గురువారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు.ప్రజా వినతులపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరిగింద ని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యల కోసం పాటుపడుతోందని ఆయన స్పష్టమ్ చేసారు ప్రజా సంక్షేమం ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతోందని వివరించారు.ఇచ్చిన హామీల అమలుకు అనుగుణంగా సీఎం , రేవంత్ ,మంత్రుల బృందం కృషి చేస్తోందన్నారు.ప్రజా భవన్ కేంద్రంగా సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం , కృష్ణా నీళ్లకు సంబంధించి వాస్తవాలను వివరించే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే చెప్పారు.బెల్లంపల్లి లో ఉగ్గ టెంపుల్ కి రోడ్డు వేయించిన ఘనత కాంగ్రెస్ పార్టీది, సీఎం రేవంత్ రెడ్డి దాని సంతోషాన్ని వ్యక్తపరిచారు.గతంలో ఎన్నడూలేని విధంగా నెన్నెల్ మండలంలో 30 కోట్లతో రోడ్లు వేశామన్నారు.కాజీపేట మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తు న్నామని తేలిపారు.బెల్లంపల్లి మున్సిపాలిటీ ప్రత్యేక నిధుల కోసం సీఎం రేవంత్ రెడ్డి గారికీ విన్నావించామన్నారు.నియోజకవర్గ అభివ్రుది, పోడు భూములను సంబంధించి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుంచి సహకారం ఉండటం లేద న్నారు.ఈ విషయంలో మంత్రి కొండ సురేఖ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

## లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష**

నిజామాబాద్, జూలై 09 : ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ, లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్దంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు, భూసేకరణ, భారీ వర్ష సూచనల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, భూభారతి తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వైద్యాధికారులు, హౌసింగ్ ఏ.ఈలు, ఐకేపీ ఏ.పీ.ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షిస్తూ, అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి కలెక్టర్ సూచనలు చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను కేటగిరీల వారీగా విభజిస్తూ, సత్వరమే వాటిని ఆన్లైన్లో ఉప్లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 14 నాటికి అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. కాగా, భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన సూచనల దృష్ట్యా, అవసరమైన ప్రాంతాలలో ముందస్తుగానే అప్రమత్తతతో కూడిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇదివరకు అతివృష్టి సమయాలలో తీసుకున్న చర్యలను సమీక్షించుకుని, ప్రస్తుతం కూడా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. కొత్త రేషన్ కార్డులు, పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా, వెంటవెంటనే పరిశీలిస్తూ అర్హులకు మంజూరీలు తెలుపాలని సూచించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా నిబంధనకు అనుగుణంగా వ్యవహరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా వారికి ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని, ఈ సందర్భంగా అక్రమాలకు తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజోపయోగ పనుల కోసం భూసేకరణ జరిపిన స్థలాలను ఆయా నిర్మాణాల నిమిత్తం సంబంధిత శాఖలకు అప్పగిస్తూ, పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




చర్లపల్లి, జూలై 10 : పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఈసీఐఎల్ చౌరస్తాలోని అక్సికేర్ వైద్యశాలలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న రాబిన్‌సన్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించి ఆయనకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలో సౌకర్యాలు కల్పించామని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ కల్లుకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి : తొట్ల ప్రభాకర్ గౌడ్




నూతనకల్, జులై 10 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గీత పనివారాల సంఘం సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి తొట్ల ప్రభాకర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలో గీత పనివారల సంఘం నూతన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ కల్లు తాగి ఆరుగురు చనిపోగా మరికొంత మంది అస్వస్థకు గురికావడం బాధాకరమన్నారు. కల్లును కల్తీ చేయడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందని తెలిపారు.కల్తీ కల్లుకి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇప్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ సొసైటీ అధ్యక్షుడు బూడిది సైదులు గౌడ్, ముగుళ్ల వెంకన్న గౌడ్, బండపల్లి శ్రీను గౌడ్, మారగోని వెంకన్న గౌడ్, మొగుల వెంకన్న గౌడ్, బూడిద రవి, ముత్యం మల్సురు, మద్దెల సురేందర్, బండపల్లి శ్రీరాములు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కుంగిన రోడ్డు.. ఇరుక్కుపోయిన ట్రక్కు..



హర్యాణా రాష్ట్రాన్ని భారీ వర్షం ముంచెత్తింది. గురుగ్రామ్ లో కేవలం 12 గంటల వ్యవధిలో 133 మి.మీ వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లపైకి భారీగా వర్షపునీరు వచ్చి చేరింది. దీంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.ఈ వర్షం కారణంగా పెరిఫెరల్ రోడ్డు లో ఓ చోట రోడ్డు కుంగిపోయి భారీ గుంత ఏర్పడింది. బుధవారం రాత్రి 10:30 గంటల ప్రాంతంలో అటుగా వెళ్తున్న ఓ ట్రక్కు గుంతలో ఇరుక్కుపోయింది దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. రంగంలోకి దిగిన అధికారులు ట్రక్కును అక్కడి నుంచి తొలగించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు, భూభారతి అమలుపై ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష

నిజామాబాద్, జూలై 09 : బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి బుధవారం కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు, భూభారతి అమలు తీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ, త్వరితగతిన వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. పేద కుటుంబాలకు సొంత ఇంటిని కల్పించేందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పథకం అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా వ్యవహరించాలన్నారు. లబ్దిదారులు అందరు ఇంటి నిర్మాణం చేపట్టేలా తోడ్పాటును అందిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. ఆర్థిక స్థోమత లేని వారికి ఐకేపీ, మెప్మా ద్వారా రుణాలు ఇప్పిస్తూ, ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. ఇసుక రవాణాలో అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. అదేవిధంగా అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, కొత్తగా పేర్ల నమోదు,

# బాబు అదిరిపోయే స్కెచ్

విజయవాడ, జూలై 10, ఏపీలో కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మూడు పార్టీల కలయిక విషయంలో అనేక రకాల ఇబ్బందులు వస్తాయని నాయకత్వాలకు తెలుసు. అందుకే చాలా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకుంటున్నాయి మూడు పార్టీలు. ఇప్పుడు తెలుగుదేశం విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట ఇన్చార్జిల నియామకం పై దృష్టి పెట్టింది. 11చోట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలవడంతో అక్కడ టిడిపి నాయకత్వాన్ని మరింత పటిష్టం చేయాలని చూస్తోంది. ఇంకోవైపు జనసేనతో పాటు బిజెపి గెలిచిన 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సైతం టిడిపి ఇన్చార్జిలను నియమించేందుకు కసరత్తు ప్రారంభించింది. అయితే ఇక్కడ ఆ రెండు పార్టీల ఎమ్మెల్యేలపై దూకుడు ప్రదర్శించకుండా.. సమన్వయంతో వ్యవహరించే వారికి ఇన్చార్జులుగా నియమించాలని చూస్తోంది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయాలు తీసుకుంటోంది.జనసేన తో పాటు బిజెపి గెలిచిన చోట్ల వైసిపి క్యాడర్ పెద్ద ఎత్తున చేరింది. అయితే వారితో ఎన్నికల సమయంలో ఇబ్బందులు తప్పవు. అందుకే క్షేత్రస్థాయిలో బలమున్న టిడిపి క్యాడర్ను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే టిడిపి అధినేత చంద్రబాబు మంచి ఆలోచన చేశారు. అక్కడ జనసేన, బిజెపి ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకునే వారికి ఇంచార్జ్ పదవులు కట్టబెట్టనున్నారు. పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో వర్మ ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. అయితే అదే నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం పెద్ద ఎత్తున జనసేనలో చేరింది. వారు అప్పటి సీన్ క్రియేట్ చేసుకున్నారు. దానినే ప్రశ్నిస్తున్నారు వర్మ. అయితే అక్కడ జరుగుతున్న తప్పిదాలను సరిచేసుకునే పనిలో ఉన్నారు పవన్ కళ్యాణ్. అటువంటి పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా చూడాలన్నది చంద్రబాబు ప్లాన్. అందుకే ఆ రెండు పార్టీల ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకునే.. సమర్థవంతమైన నేతలకి అక్కడ బాధ్యతలు అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.ప్రధానంగా జనసేన ఉభయగోదావరి తో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కువగా విజయం సాధించింది. ఆయా చోట్ల తెలుగుదేశం పార్టీకి బలమైన కేడర్ ఉంది. దానిని కాపాడుకోవడం ఇప్పుడు కూటమికి ఉత్తమం. జనసేన తో పాటు బిజెపికి సీట్లు కేటాయించే నియోజకవర్గాల్లో టిడిపి కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. అది పవన్ కళ్యాణ్ తో పాటు బిజెపి నాయకత్వానికి తెలుసు. అందుకే చంద్రబాబు ఆ రెండు పార్టీల నాయకత్వాలతో ఆలోచన చేస్తున్నారు. టిడిపి ఇన్చార్జ్ ల నియామకంపై కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేన ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల.. వారి సిఫారసు తోనే టిడిపి ఇన్చార్జిలను నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.మూడు పార్టీల మధ్య సమన్వయ లోపంతో రాజకీయంగా లబ్ధి పొందాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టి వ్యూహంతో ఉంది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన చాలామంది నేతలు కూటమి పార్టీల వైపు వెళ్లారు. వారు వచ్చే ఎన్నికల నాటికి తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని ఒక అంచనాలు ఉన్నాయి. పేరుకే వారి కూటమి పార్టీలో చేరారు కానీ.. అక్కడ విభేదాలు సృష్టించేందుకు వెళ్లారని అనుమానాలు ఉన్నాయి. ఇటువంటి వారి విషయాన్ని ముందే గ్రహించారు సీఎం చంద్రబాబు. వారిని వలస పక్షులతో పోల్చారు. అందుకే ఇప్పుడు టిడిపి ఇన్చార్జిల నియామకంలో.. ఆ రెండు పార్టీల అభిప్రాయాలను తీసుకొనున్నారు. మూడు పార్టీల శ్రేణుల మధ్య సమన్వయ సాధనకు.. ఎటువంటి లోపాలు తలెత్తకుండా ద్వితీయ శ్రేణి నాయకులకు నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వాలని చంద్రబాబు చూస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జగన్ పర్యటనలు ఎలా మారుతున్నాయి...



తిరుపతి జూలై 10, వైసీపీ అధినేత జగన్ పర్యటనలు అంటేనే టెన్షన్ మధ్య సాగుతున్నాయి. నిజానికి ఇది కేవలం ప్రభుత్వానికి మాత్రమే కాదు స్థానిక పోలీసులకు కూడా తలనొప్పిగా తయారయింది. జగన్ జిల్లాలకు వస్తున్నారంటే పోలీసులతో పాటు సిబ్బంది కూడా భయపడిపోతున్నారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా, ఎన్ని హెచ్చరికలుచేసినా బేఖాతరు చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ వివిధ వర్గాల సమస్యలపై జిల్లాలను పర్యటిస్తున్నారు. అయితే ఆయన పర్యటనలు వరసగా వివాదం అవుతుండటం, ఏదో ఒక అనుకోని ఘటనలు జరుగుతుండటంతో శాంతిభద్రతల సమస్యగా మారుతుంది. పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా జరగాల్సిన నష్టం రిగిపోతూనే ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీకి సమస్యలను అడ్రస్ చేయడానికి ఆసక్తి చూపుతారు. అధికారంలో ఉన్నప్పుడు కనపడని సమస్యలు అధికారం లేనప్పుడు కనిపిస్తాయి. అది చంద్రబాబుకు అయినా.. జగన్ కు అయినా అంతే. కేవలం ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే కాదు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. ఏ మాత్రం అవకాశం ఉన్నా వెంటనే ప్రతిపక్ష నేతలు అక్కడకు వెళ్లి పరామర్శించి తాము ఉన్నామని ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తారు. నిజానికి ప్రతిపక్ష నేతలు ఎవరు ఎన్ని పర్యటనలు చేసినా ఆ సమస్యలు పరిష్కారం కావు. అధికారంలో ఉన్న పార్టీ మాత్రమే సమస్యలను పరిష్కరించేందుకు అవకాశముంటుంది. అది గిట్టుబాటు ధరలైనా? మరొకటైనా పవర్ లో ఉన్న పార్టీ స్పందిస్తేనే అనుకూలమైన నిర్ణయం వస్తుంది అది తెలిసినా ప్రజలు మాత్రం ప్రతిపక్ష నేతలు తమ వద్దకు వస్తే బాహ్య ప్రపంచానికి తెలుస్తుందని నమ్ముతారు. ఉదాహరణకు మిర్చి రైతుల సమస్యలపై గిట్టుబాటు ధరలు రావడం లేదని జగన్ గుంటూరు పర్యటనలు చేశారు. తర్వాత కొంత అధికార పార్టీలో హడావిడి కనిపించింది. ఆ సమస్య మళ్లీ ఇక కనిపించలేదు. ఇక పొగాకు కు మద్దతు ధర కల్పించాలంటూ రైతులు ఇబ్బందులు పడుతుండటంతో జగన్ పొదిల పర్యటన చేపట్టారు. తర్వాత కేంద్ర మంత్రి వచ్చి పొగాకు బోర్డును సందర్శించి వెళ్లారు. తర్వాత ఆ సమస్య పరిష్కారం అయిందో లేదో తెలియదు. ఇప్పుడు జగన్ బంగారు పాళ్యం పర్యటనలోనూ మామిడి రైతులు పరామర్శించారు. అయితే ఇది కూడా నాలుగు రోజుల తర్వాత అంతే. కానీ జగన్ పర్యటనల్లో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కార్యకర్తలు భారీగా తరలి వస్తుండటంతో పోలీసులు అదుపు చేయలేకపోతున్నారు. పొదిలి పర్యటనలో టీడీపీ కార్యకర్తలకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ జరిగింది. జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో ఒక వ్యక్తి మరణించడం కలకలం రేపింది. దీనిపై జగన్ తో పాటు పలువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఈరోజు తాజాగా బంగారుపాళ్యం ఘటనలో కార్యకర్తలు పోలీసుల లాఠీఛార్జిలో తీవ్రంగా గాయపడ్డారు. జగన్ పర్యటనలు కొన్ని రోజుల ముందు హైటెన్షన్ మధ్య కొనసాగుతుండటంతో పోలీసులకు తలనొప్పిగా తయారయ్యాయి. అలాగని పర్యటనలకు అడ్డు చెప్పలేరు. నిబంధనలు పెట్టినా అమలు కావు. మరి మరో నాలుగేళ్లు ఇలాగే కొనసాగాల్సిందేనా? అన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

జగన్ ది విధ్వంస యాత్రే : అచ్చెన్నాయుడు

జగన్ పర్యటన సినిమాసెట్టింగ్ మాదిరిగాఉందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ లేని సమస్యను సృష్టించేందుకు జగన్ పర్యటనలు చేస్తున్నారన్నారు. అన్నమయ్య జిల్లాల్లో 99 శాతం మామిడి కొనుగోళ్లు పూర్తయ్యాయన్న అచ్చెన్నాయుడు పరిష్కారం కోసం కాదు..ప్రచారం కోసమే వాళ్ల ఆరాటమని, జనసమీకరణ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. డబ్బులు ఖర్చు పెట్టి మరీ జనాలను తీసుకొస్తున్నారని అన్నారు. ఆరు కిలోమీటర్ల దూరంలో హెలిప్యాడ్‌కు అనుమతి కావాలన్నారని, వంద మీటర్ల దూరంలో అనుమతి ఇస్తామంటే ఒప్పుకోరని తెలిపారు. హెలిప్యాడ్ దగ్గరకు వచ్చి విధ్వంసం చేస్తున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. క్రిమినల్ ఆలోచనలు, సెట్టింగ్‌లతోనే ఇలాంటి కార్యక్రమాలు చేశారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. వైసీపీ నేతకు చెందిన పొలంలో పండిన మామిడి పండ్లను తెచ్చి రోడ్లపైకి పోసి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు నటించారని, జగన్ విపక్షంలో ఉండి కూడా విధ్వంసాన్ని సృష్టించేలా ప్రవర్తిస్తున్నారని అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

ప్రతి చోట బలప్రదర్శనే

సత్యసాయి, పల్నాడు జిల్లాల్లో ఎదురైన పరిణామాలు దృష్ట్యా చిత్తూరు పోలీసులు ముందుగానే ఆంక్షలు విధించారు. పల్నాడు జిల్లాలో జగన్ పర్యటనలో అపశృతులు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. సింగయ్య అనే వృద్ధుడు జగన్మోహన్ రెడ్డి ప్రయాణిస్తున్న కారు కింద పడి చనిపోయాడు. మరో ఇద్దరూ జగన్మోహన్ రెడ్డి కాన్వాయ్ మూలంగా చనిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్న ఆరోపణలు వచ్చాయి. అయితే ఇప్పుడు మామిడి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ జగన్మోహన్ రెడ్డి నేరుగా వారిని పరామర్శించేందుకు బయలుదేరారు. అయితే సీజన్ దాటిన తర్వాత పరామర్శ ఏమిటన్న విమర్శ వినిపిస్తోంది. కేవలం ఇది రాజకీయ కోణంలో చేస్తున్న పర్యటనగా మిగతా రాజకీయ పక్షాలు అభివర్ణిస్తున్నాయి. కానీ జగన్ ఇవేవీ పట్టించుకోలేదు.మరోవైపు నిన్ననే చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జగన్ పర్యటనలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అలా నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. కానీ కనీస స్థాయిలో కూడా వైసిపి నేతలు దీనిని పట్టించుకోలేదు. భారీగా జన సమీకరణ చేశారు. అడుగడుగునా ఆంక్షలు అధిగమించారు. బంగారుపాళ్యంలోని మార్కెట్ యార్డులో 500 మందికి మించి ఉండకూడదని పోలీసులు తేల్చి చెప్పారు. కానీ వేలాది మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుగానే మార్కెట్ యార్డులోకి చొచ్చుకొచ్చాయి. మరోవైపు భారీగా జన సమీకరణ నడుమ కాన్వాయ్ నడుస్తుండగా.. విజయానంద రెడ్డి అనే వైసీపీ నేత కింద పడిపోయారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించాల్సిన పరిస్థితి ఎదురయింది. అయితే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆ ఒక్క నియోజకవర్గమేనా

విజయవాడ, జూలై 10, కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయింది. గత ఎన్నికల్లో జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీ చేసి విజయం సాధించింది. అయితే జనసేన అధినేతగా పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు ఆయా నియోజకవర్గాల్లో పర్యటించి వచ్చారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమిలోని ఇతర పార్టీల అభ్యర్థుల తరుపున కూడా ప్రచారం చేసినప్పటికీ తన పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎన్నికలకు ముందు పర్యటించిన జగన్ కనీసం గెలిచి ఏడాది గడుస్తున్నప్పటికీ ఆ నియోజకవర్గాలకు వెళ్లడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 21 శాసనసభ నియోజకవర్గాల్లో జనసేన ఎమ్మెల్యేలు ఉంటే కనీసం అక్కడ పర్యటించేందుకు కూడా పవన్ కల్యాణ్ కు తీరికలేదా? అని ప్రశ్నిస్తున్నారు. తాము ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజక వర్గాల్లో అధికారులు తమ మాట వినడం లేదని, అక్కడ టీడీపీ ఇన్ ఛార్జుల మాటే చెల్లుబాటు అవుతుందని, తమను అధికారంలో ఉన్న వారిగా అధికారులు కూడా పరిగణించడం లేదని ఎమ్మెల్యేలు మొత్తుకుంటున్నా అటు వైపు జనసేనాని చూడకపోవడంపై పార్టీలో చర్చ జరుగుతుంది. కనీసం హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు సాధించిన తన విజయానికి కారణమైన నియోజకవర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు కూడా పవన్ కల్యాణ్ సమయాన్ని వెచ్చించకపోవడంపై నేతలు నిరాశ చెందుతున్నారు. స్థానిక కార్యకర్తలు కూడా పవన్ కల్యాణ్ ను ఎప్పుడు నియోజకవర్గానికి తీసుకువస్తారని ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో తమ నియోజకవర్గాల్లో పేరుకుపోయిన సమస్యలను చెప్పుకుందామంటే పవన్ కల్యాణ్ కనీసం ఇటు వైపు చూడకపోవడమేంటన్నది ఎమ్మెల్యేలు కూడా నిరాశ చెందుతున్నారు. పవన్ కల్యాణ్ తమ నియోజకవర్గానికి ఒకసారి వచ్చి ప్రజలతో కలిసి బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా వివరిస్తే బాగుంటుందని చెబుతున్నారు. ప్రజల్లో పవన్ కల్యాణ్ నోటి ద్వారా వచ్చే మాటలకు ఎక్కువ విశ్వసనీయత ఉంటుందని, తాము మరోసారి ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నా, మరొకసారి ఈ నియోజకవర్గం నుంచి గెలవాలన్నా పవన్ పర్యటనలను నియోజకవర్గాల్లో చేయాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు. షూటింగ్ లవల్లనేనంటూ అసలు తాను ప్రాతినిధ్యం వహించిన పిఠాపురం నియోజకవర్గానికే పవన్ కల్యాణ్ చుట్టపు చూపుగా వచ్చిపోతున్నారని, ఇక 20 నియోజకవర్గాల్లో ఎలా పర్యటిస్తారని కొందరు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. అయితే పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన ఆయన గతంలో అంగీకరించిన సినిమాల షూటింగ్ ల కారణంగా వాయిదా పడుతూ వస్తుందని, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించడానికి ప్లాన్ చే?స్తున్నారని పార్టీ వర్గాలు చెబుతు న్నాయి.

# వేమిరెడ్డికి కలిసి రాని రాజకీయాలు



నెల్లూరు, జూలై 10,నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కుటుంబానికి ప్రత్యేకత ఉంది. ఆయన రాజకీయాల్లోకి రాకముందు నుంచి స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహించారు. నెల్లూరు జిల్లాల్లో అనేక గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడమే కాకుండా ఆరోగ్యం విషయంలో కూడా ప్రజలకు అండగా నిలిచే కుటుంబంగా పేరు తెచ్చుకుంది. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవలు, చేసిన పనులు ఆయనకు మంచి పేరును తెచ్చి పెట్టాయి. అలాంటి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కుటుంబం రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత మాత్రమే బద్నాం అవుతుంది. రాజకీయాల్లోకి వస్తే అంతే. ఎంత సేవ చేసినా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వేమిరెడ్డి కాదు.. ఎంతటి వారికైనా విమర్శలు తప్పవు.అలాంటి పరిస్థితుల్లోనే ప్రస్తుతం వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కుటుంబం ఉంది. రాజకీయాల్లోకి రాకముందు నెల్లూరు జిల్లాకు మాత్రమే వీరు సుపరిచితం. ఆర్థికంగా బలమైన కుటుంబం కావడం, చేయి చాచిన వారికి లేదనకుండా గుప్త దానాలు చేయడం వేమిరెడ్డి కుటుంబానికి అలవాటు. అలాంటిది సహజంగానే డబ్బు ఎక్కువై, సేవా నిరతితో జనానికి దగ్గర కావడంతో రాజకీయాల్లోకి రావాలని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆకాంక్ష తొలుత వైసీపీ నెరవేర్చింది. ఆర్థికంగా బలవంతుడైన, సామాజికవర్గంగా శక్తివంతుడైన వేమిరెడ్డిని తొలుత వైసీపీ గుర్తించి రాజ్యసభ సభ్యుడిగా చేసింది. అయితే 2024 ఎన్నికలకు ముందుకు వేమిరెడ్డికి రాజకీయాలపై మరింత మక్కువ పెరిగింది.నెల్లూరు జిల్లాపై తన దైన ముద్ర ఉండాలని, తాను శాసించాలని భావించారు. అందుకే కొన్ని సీట్లు ఆశించారు. కానీ జగన్ మాత్రం అందుకు అంగీకరించలేదు. దీంతో ఆయన వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి వెళ్లారు. నిజానికి నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంలో పోటీ చేసేందుకు బలమైన నేత టీడీపీ నేత ఎవరూ లేరు. నెల్లూరు జిల్లా వైసీపీ?కి కంచుకోట కావడంతో ఆ పార్లమెంటు స్థానాన్ని దక్కించుకోవడం కష్టంగా మారింది. 2024 ఎన్నికలకు ముందు వరకూ నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయాల్సిందిగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని పార్టీ కోరినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇందుకు సోమరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సుముఖత వ్యక్తం చేయలేదు. తాను మరోసారి సర్వేపల్లి నుంచి పోటీ చేస్తానని ఆయన చెప్పడంతో పార్లమెంటు అభ్యర్థి కోసం టీడీపీకి పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో వేమిరెడ్డి రాక పార్టీకి ప్లస్ అయింది.టీడీపీలోకి వస్తూనే తాను నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ సభ్యుడిగా పోటీ చేశారు. వేమిరెడ్డి సతీమణి ప్రశాంతి రెడ్డి కోవూరు నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీ చేశారు. నెల్లూరు జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ సూపర్ విక్టరీని సాధించింది. ఇద్దరూ గెలిచారు. అప్పటి నుంచి వేమిరెడ్డి కుటుంబంపై వివాదాలు ప్రారంభమయ్యాయి. అప్పటి వరకూ తమ పని తాము చేసుకుంటూ వెళ్లే కుటుంబం వీధిలోకి రావడానికి రాజకీయాలే కారణమన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో ఉంటే ప్రత్యర్థులు వ్యక్తిగత దూషణలకు కూడా వెనుకాడరు. రాజకీయాలు ఒక బురద అని తెలిసి కూడా అందులో కాలు మోపడమే వేమిరెడ్డి కుటుంబం చేసిన తప్పులా కనిపిస్తుంది. మరి ఆ బురదను కడుక్కోవాలే తప్ప మరేమీ చేయలేని పరిస్థితి ఎవరికైనా ఉంటుంది.

# సచివాలయం దగ్గర స్మార్ట్ ఎంట్రీ...

విజయవాడ, జూలై 10,ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో టెక్నాలజీని మరింతగా పెంచుతున్నారు. అమరావతి సచివాలయంలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు సరికొత్త విధానం తీసుకువస్తున్నారు. ఉద్యోగులు, సందర్శకులకు స్మార్ట్ కార్డులు, క్యూఆర్ కోడ్‌లు, ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లను ప్రవేశపెడుతున్నారు. దీని ద్వారా ఎవరు వస్తున్నారు, ఎప్పుడు వెళ్తున్నారనే వివరాలు నమోదవుతాయి. ఈ కొత్త టెక్నాలజీతో సచివాలయంలోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని అరికట్టవచ్చు. ఇంతకీ ఈ టెక్నాలజీ ఎలా పనిచేస్తుందో తెలుసా?ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి టెక్నాలజీని పాలనలో భాగం చేస్తున్నారు. రాజధాని అమరావతిలో ఉన్న సచివాలయంలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై సచివాలయానికి వచ్చే ఉద్యోగులు, సందర్శకులు, వాహనాలను స్మార్ట్ కార్డులు, క్యూఆర్ కోడ్ స్లిప్పులు, ఆర్‌ఎఫ్ఐడీ స్టిక్కర్ల ద్వారా అనుమతించనున్నారు..

సచివాలయం ప్రవేశ ద్వారం దగ్గర సెక్యూరిటీ రూంలో పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. వారంలో ఈ పనులు పూర్తి చేస్తారు.. ఇకపై సచివాలయంలోకి ఎవరు వస్తున్నారు, ఎప్పుడు వెళ్తున్నారు అనే వివరాలను నమోదవుతాయి.అమరావతి సచివాలయానికి అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు వస్తుంటారు.. అలాగే సందర్శకులు కూడా వస్తారు. ఉద్యోగులు, అధికారులు, జర్నలిస్టులు ప్రభుత్వం ఇచ్చిన ఐడీ కార్డులను చూపించి లోపలికి వెళ్ళేవారు. ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా మ్యాగ్నెటిక్ స్ట్రిప్ ఉన్న స్మార్ట్ కార్డులను ఇస్తోంది.. ఈ స్మార్ట్ కార్డును జస్ట్ అలా స్కాన్ చేయగానే గేట్లు ఆటోమేటిక్‌గా తెరుచుకుంటాయి.. ఎవరు లోపలికి వచ్చారు, ఎవరు బయటకు వెళ్లాలో వివరాలు నమోదవుతాయి. ఇలా స్కాన్ చేసిన సమయంలో డేటా బేస్‌లోని వివరాతో గేట్లు తెరుచుకుంటాయి. ఈ మేరకు ఈ స్మార్ట్ కార్డుల వ్యవస్థ బాధ్యతను బెంగళూరుకు చెందిన 'సత్యాలజీ' అనే సంస్థకు అప్పగించారు.సచివాలయానికి వాహనాల్లో వచ్చే ఉద్యోగులకు, సిబ్బందికి ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్ ఇస్తారు. వాహనం ముందు ఈ స్టిక్కర్‌ను అతికించి.. గేటు దగ్గర ఉన్న స్కానర్ స్కాన్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.. అది స్కాన్ చేయగానే గేట్లు తెరుచుకుంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఫాస్ట్‌ట్యాగ్ లాగా పనిచేస్తుంది. సచివాలయానికి వచ్చే ఉద్యోగుల వాహనాల నంబర్లను కూడా ఈ మేరకు డేటాబేస్‌లో నమోదు చేస్తారు.

# ప్రసన్నకుమార్ రెడ్డిపై వరుస కేసులు

నెల్లూరు, జూలై 10, కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కేసు నమోదైంది. మరోవైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సైతం ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ మహిళా సమాజం తరపున వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి సంఘీభావం తెలిపారు. మహిళలను కించపరిచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భువనేశ్వరి కోరారు.నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కేసు నమోదైంది. కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మీద పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ మహిళ ఫిర్యాదు ఆధారంగా నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. త్వరలోనే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని విచారణకు రావాలంటూ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందికోవూరు నియోజకవర్గంలోని పడుగుపాడులో జరిగిన వైసీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి.. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అనంతరం సోమవారం రాత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై కొంతమంది దాడి చేశారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై కొందరు మూకుమ్మడిగా దాడి చేసి కారు, ఇంట్లోని ఫర్నిచర్, కుర్చీలను విరగ్గొట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ మహిళా కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశారు. తాజాగా ఓ మహిళ ఫిర్యాదు ఆధారంగా కోవూరు పోలీసులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మీద కేసు నమోదు చేశారు. త్వరలోనే విచారణకు పిలిచే అవకాశం ఉంది.నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలపై సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి.. నారా భువనేశ్వరి స్పందించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా నారా భువనేశ్వరి ట్వీట్ చేశారు." కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారిపై చేసిన అవమానకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ కఠినమైన సమయంలో ప్రశాంతి రెడ్డి గారికి సంఘీభావం ప్రకటిస్తున్నాను. మహిళల వ్యక్తిత్వ హననం చేసే విధంగా వారు తరుచూ చేస్తున్న వ్యాఖ్యలు మహిళా సమాజంపై వారి అభిప్రాయాలు ఏంటో తెలియజేస్తున్నాయి. ఇలాంటి పోకడలను మహిళా లోకం ఎన్నటికీ క్షమించదు. “"రాజధాని రైతుల ఉద్యమ సమయంలో కావచ్చు, అమరావతి ప్రాంత మహిళలపై కావచ్చు. గతంలో ఇలాంటి దాడులు, వ్యాఖ్యలే చేశారు. అయితే స్త్రీలను ఇలాంటి పోకడల ద్వారా బలహీన పరచాలనే ప్రయత్నాలు ఫలించవు. నేటి తరం మహిళలు వీటిని తట్టుకుని మరింత దృఢంగా ముందుకు సాగుతారు అనడంలో సందేహం లేదు. అవమానకరమైన వ్యాఖ్యలు, ఆత్మగౌరవం దెబ్బతీసే చర్యలతో మహిళల విలువను, స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. స్త్రీలను గౌరవించే మన సంస్కృతిలో, దానిని దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా అందరూ తిప్పికొట్టాలి. ఈరోజు, రేపు, ఎప్పుడైనా సరే, స్త్రీలను కించపరిచే, నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే చర్యలను ఐక్యంగా ఎదిరించి మరింత బలంగా నిలబడదాం" అంటూ నారా భువనేశ్వరి ట్వీట్ చేశారు

# కప్పట్రాళ్ళ గ్రామంలో "డ్రగ్స్ వద్దు బ్రో" అనే పోస్టర్లు ఆవిష్కరణ

**ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కప్పట్రాళ్ళ గ్రామంలో మెగా టీచర్స్ పేరెంట్ " 2.0 మీటింగ్... విద్యార్థులతో ఆత్మీయ సమావేశం**

**గత ఏడాది 10, 9 వ తరగతులలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత**





కర్నూలు, జూలై 10 డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యమని, సమిష్టి కృషితో డ్రగ్స్ ను పారద్రోలుదామని ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు పిలుపునిచ్చారు. గురువారం దేవనకొండ మండలం కప్పట్రాళ్ళ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో " మెగా టీచర్స్ పేరెంట్ "2.0 మీటింగ్ నిర్వహించారు. ఈగల్ ఐజి , కర్నూలు జిల్లా ఎస్పీలు ముఖ్య అతిథిగా పాల్గొని " డ్రగ్స్ వద్దు బ్రో " అనే కార్యక్రమంపై అవగాహన చేశారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే అంశంపై ఐజి, జిల్లా ఎస్పీలు అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఈగల్ ఐజి ఆకే రవి కృష్ణ మాట్లాడుతూ." మెగా టీచర్స్ పేరెంట్ " 2.0 మీటింగ్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తుందన్నారు. డ్రగ్స్ నిషేధిత గ్రామంగా రాష్ట్రంలోనే కప్పట్రాళ్ళ గ్రామం మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలంటే పిల్లల తోనే సాధ్యమన్నారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలని విద్యార్థులతో కలిసి ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ బడులకు విద్యార్థులు బాగా రావాలన్నారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగా ఈ రోజు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అనే పేరుతో పోస్టర్స్ ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పోస్టర్స్ ఆవిష్కణలో "డ్రగ్స్ మిమ్మల్నే కాదు, మీ కుటుంబాలని నాశనం చేస్తుంది","బాల్యాన్ని బలి తీసుకుంటున్న డ్రగ్స్ మత్తులో పిల్లల పై అఘాయి త్యాలు " "డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కొంటున్న విద్యార్థులు " అనే పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. యువత తప్పు ద్రోవ పడకూడదన్నారు. విద్యార్థులు చదువుకోవాలి, సాధించాలంటే ఎక్కడ ఉన్నా సాధించవచ్చన్నారు. పుస్తకాలు బాగా చదవాలన్నారు. 10 వ తరగతిలో 100 శాతం ఫలితాలు ఈ స్కూల్ విద్యార్థులు సాధించాలన్నారు. ఐజి ఆకే రవికృష్ణ తండ్రి అయిన ఆకే పల్లంరాజు జ్ఞాపకార్థంగా గత ఏడాది 10 వ తరగతి, 9 వ తరగతులలో ప్రథమ , ద్వితీయ , తృతీయ స్థానాలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహాలను జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. కప్పట్రాళ్ళ గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో చదవాలన్నారు. కప్పట్రాళ్ళ గ్రామాన్ని ఐజి ఆకే రవికృష్ణ గారు దత్తత తీసుకోవడం కప్పట్రాళ్ళ గ్రామ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. డ్రగ్స్ అనర్థాలపై అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్ధేశ్యమన్నారు. ఎక్కడైనా గంజాయి సాగు, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం, తదితరాల గురించి సమాచారం టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ఈ గల్ ఐజి ఆకే రవికృష్ణ, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు కప్పట్రాళ్ళ గ్రామ పాఠశాల విద్యార్థులతో కలిసి సహా పంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో ఆత్మీయ సమావేశం కార్యక్రమం కంటే అంతకు ముందుగానే ఐజి ఆకే రవికృష్ణ దత్తత గ్రామమైన కప్పట్రాళ్ళ గ్రామంలోని తానా భవనంలో కప్పట్రాళ్ళ రైతులతో పాటు దేవనకొండ మండలంలోని కొన్ని గ్రామాల రైతులకు సే ట్రీస్ మరియు నవ యూత్ అసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు పంపిణి చేశారు. గ్రామంలో సే ట్రీస్ ద్వారా నాటిన పండ్ల తోటలను పరిశీలించారు. వ్యవసాయ పరికరాలు అందజేశారు. పొదుపు మహిళలతో మాట్లాడారు. బయో గ్యాస్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాల్మికి సంఘం స్టేట్ చైర్మన్ బొజ్జమ్మ , పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య , దేవనకొండ సిఐ వంశీనాథ్, ఎంపిటిసి చింతమాను రూపమ్మ, కప్పట్రాళ్ళ గ్రామ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ప్రశాంతి,విశ్రాంత హెడ్మాస్టర్ రామరాజు, హైస్కూల్ స్కూల్ మేనేజ్ మెంట్ కమిటి రమేష నాయుడు, వ్యవసాయ అధికారి అక్బర్ భాషా, సే ట్రీస్ మేనేజర్ బి నారాయణ , నవ యూత్ అసోసియేషన్ సీఈవో యు నరసింహులు, ఈగల్ టీం ఎస్సై సుజన్ కుమార్, గ్రామస్తులు కప్పట్రాళ్ళ మల్లికార్జున, మధు, ఈరన్న, ఎల్ ఐ సి రాజు, చింతమాను రవికుమార్, ఈగల్ టీం సిబ్బంది, కప్పట్రాళ్ళ గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులు ఉన్నారు.

## 20 వ తేదీ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

**జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 10–ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో ఈనెల 20వ తేదీ స్థానిక నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ వివరాలను గురువారం రామకృష్ణ డిగ్రీ కళాశాల లో జరిగిన సమావేశంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, అధ్యక్షులు డాక్టర్ జి రవికృష్ణ, టోర్నమెంట్ చైర్మన్ హేమంత్ రెడ్డి, రాష్ట్ర చెస్ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి టోర్నమెంట్ వివరాల పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 6,8,10,12,14 ,16 సంవత్సరాల లోపు కేటగిరీలలో ఓపెన్ మరియు బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తామని, ఈ టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన వారితో జాతీయ స్థాయి చెస్ స్కూల్ టోర్నమెంట్ లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విజేతలకు వివిధ కేటగిరీలలో బహుమతులను అదే రోజు సాయంత్రం అందజేస్తారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ లో క్రీడాకారులుగా నమోదు చేసుకున్న వారు ఈనెల 16వ తేదీ లోపు వెబ్ సైట్ లో ఎంట్రీలు నమోదు చేసుకోవలసి ఉంటుందని తెలిపారు . ఇతర వివరాలకు 9010451585 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

## డోన్ సబ్ ట్రెజరీ కార్యాలయం అకస్మిక తనిఖీ



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 10–డోన్ ఉప ఖజాన కార్యాలయాన్ని జిల్లా ఖజానా అధికారి శ్రీమతి లక్ష్మీ దేవి ఆకస్మికంగా తనిఖీ చేసారు. హాజరు పట్టిక, ట్రెజరీ బిల్లు రిజిస్టర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ పరిసరాలను శుభ్రముగా ఉంచుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. ఉపఖాజన అదికారిపలనాటి సునీల్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన పార్టీ లోకి ఆర్యవైశ్య నాయకులు




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 10–నంద్యాల పట్టణం లో బంగారు వ్యాపారి గా పేరున్న భవనాసి శ్రీ రామమూర్తి తనయుడు వాసు సడన్ గా రాజకీయ ఎంట్రీ ఇవ్వడం రాజకీయ వర్గాల లో ప్రకంపనలు రేగుతున్నాయి. 50 ఏళ్లకు పైగా వయస్సున్న వాసు సోదరుడు మహేష్ తో బంగారు వ్యాపారం చేస్తూ రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నారు...గతం లో దివంగత సీఎం కొణిజేటి రోశయ్య అనుచరుడు గా నంద్యాల లో కొనసాగారు..తరువాత ఉమ్మడి కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా కొనసాగారు. ఇప్పుడు వాసు సోదరుడు నాగ మహేష్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా కొనసాగుతున్నారు..ఇవ్వన్నీ పాతవైతే ఇప్పుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి పార్టీలో చేరడం చర్చనీయసయం గా మారింది..ఇంతకు పవన్ కళ్యాణ్ తో కలిపింది ఎవ్వరు..వాసు ప్రభుత్వం లో ఏమైనా ఆశిస్తున్నారు..లేక..పార్టీ లో వాసు కు ఏమైనా పదవి అసిస్తున్నారా...మొత్తం మీద వాసు జనసేన ఇచ్చిన సడన్ ఎంట్రీ ఎటు వైపు ట్విస్ట్ ఇస్తుందో వేసి చూడాల్సిందే.

## కప్పట్రాళ్ళ గ్రామంలో "డ్రగ్స్ వద్దు బ్రో" అనే పోస్టర్లు ఆవిష్కరణ చేసిన ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ..

విభారే న్యూస్ జూలై 10 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.కప్పట్రాళ్ళ గ్రామంలో మెగా టీచర్స్ పేరెంట్ " 2.0 మీటింగ్ విద్యార్థులతో ఆత్మీయ సమావేశం. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలి. గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలి. గత ఏడాది 10, 9 వ తరగతులలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేసిన జిల్లా ఎస్పీ. దేవనకొండ మండలం, కప్పట్రాళ్ళ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో " మెగా టీచర్స్ పేరెంట్ " 2.0 మీటింగ్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈగల్ ఐజి, కర్నూలు జిల్లా ఎస్పీ.డ్రగ్స్,గంజాయి రహిత సమాజమే మన లక్ష్యం.సమిష్టి కృషితో డ్రగ్స్ ను పారద్రోలుదాం.డ్రగ్స్ సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1972 నెంబరుకు తెలియజేయండి.డ్రగ్స్ అనర్థాలపై అవగాహన తీసుకురా వడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యమని,సమిష్టి కృషితో డ్రగ్స్ ను పారద్రోలుదామని ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ ఐపియస్,కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ లు పిలుపునిచ్చారు. గురువారం దేవనకొండ మండలం,కప్పట్రాళ్ళ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో " మెగా టీచర్స్ పేరెంట్ " 2.0 మీటింగ్ నిర్వహించారు. ఈగల్ ఐజి,కర్నూలు జిల్లా ఎస్పీ లు ముఖ్య అతిథిగా పాల్గొని " డ్రగ్స్ వద్దు బ్రో "అనే కార్యక్రమం పై అవగాహన చేశారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే అంశం పై ఐజి, జిల్లా ఎస్పీ లు అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఈగల్ ఐజి ఆకే రవి కృష్ణ మాట్లాడుతూ "మెగా టీచర్స్ పేరెంట్ " 2.0 మీటింగ్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తుందన్నారు.డ్రగ్స్ నిషేధిత గ్రామంగా రాష్ట్రంలోనే కప్పట్రాళ్ళ గ్రామం మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలంటే పిల్లల తోనే సాధ్యమన్నారు.పిల్లల భవిష్యత్తు బాగుండాలని విద్యార్థులతో కలిసి ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రభుత్వ బడులకు విద్యార్థులు బాగా రావాలన్నారు.ఈ క్యాంపెయిన్ లో భాగంగా ఈ రోజు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో డ్రగ్స్



వద్దు బ్రో అనే పేరుతో పోస్టర్స్ ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పోస్టర్స్ ఆవిష్కణలో "డ్రగ్స్ మిమ్మల్నే కాదు,మీ కుటుంబాలని నాశనం చేస్తుంది", "బాల్యాన్ని బలి తీసుకుంటున్న డ్రగ్స్ మత్తులో పిల్లల పై అఘాయిత్యాలు" "డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కొంటున్న విద్యార్థులు "అనే పోస్టర్లను ఆవిష్కరణ చేశారు.యువత తప్పు ద్రోవ పడకూడదన్నారు. విద్యార్థులు చదువుకోవాలి, సాధించాలంటే ఎక్కడ ఉన్నా సాధించవచ్చన్నారు. పుస్తకాలు బాగా చదవాలన్నారు. 10 వ తరగతిలో 100 శాతం ఫలితాలు ఈ స్కూల్ విద్యార్థులు సాధించాలన్నారు. ఐజి ఆకే రవికృష్ణ తండ్రి అయిన ఆకే పల్లంరాజు జ్ఞాపకార్థంగా గత ఏడాది 10 వ తరగతి,9 వ తరగతులలో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహాలను జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. కప్పట్రాళ్ళ గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ మాట్లాడుతూవిద్యార్థులు ఒక లక్ష్యంతో చదవాలన్నారు. కప్పట్రాళ్ళ గ్రామాన్ని ఐజి ఆకే రవికృష్ణ దత్తత తీసుకోవడం కప్పట్రాళ్ళ గ్రామ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. డ్రగ్స్ అనర్థాలపై అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్ధేశ్యమన్నారు.ఎక్కడైనా గంజాయి సాగు, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు,వినియోగం, తదితరాల గురించి సమాచారం టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలన్నారు.వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ఈ గల్ ఐజి ఆకే రవికృష్ణ, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ లు కప్పట్రాళ్ళ గ్రామ పాఠశాల విద్యార్థులతో కలిసి సహా పంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో ఆత్మీయ సమావేశం కార్యక్రమం కంటే అంతకు ముందుగానే ఐజి ఆకే రవికృష్ణ దత్తత గ్రామమైన కప్పట్రాళ్ళ గ్రామంలోని తానా భవనంలో కప్పట్రాళ్ళ రైతులతో పాటు దేవనకొండ మండలంలోని కొన్ని గ్రామాల రైతులకు సేట్రీస్, నవ యూత్ అసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు పంపిణి చేశారు. గ్రామంలో సే ట్రీస్ ద్వారా నాటిన పండ్ల తోటలను పరిశీలించారు. వ్యవసాయ పరికరాలు అందజేశారు.పొదుపు మహిళలతో మాట్లాడారు. బయో గ్యాస్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వాల్మికి సంఘం స్టేట్ చైర్మన్ బొజ్జమ్మ, పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య , దేవనకొండ సిఐ వంశీనాథ్, ఎంపిటిసి చింతమాను రూపమ్మ,కప్పట్రాళ్ళ గ్రామ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ప్రశాంతి,విశ్రాంత హెడ్ మాస్టర్ రామరాజు, హైస్కూల్ స్కూల్ మేనేజ్ మెంట్ కమిటి రమేష నాయుడు,వ్యవసాయ అధికారి అక్బర్ భాషా, సే ట్రీస్ మేనేజర్ బి నారాయణ,నవ యూత్ అసోసియేషన్ సీఈవో యు నరసింహులు, ఈగల్ టీం ఎస్సై సుజన్ కుమార్,గ్రామస్తులు కప్పట్రాళ్ళ మల్లికార్జున, మధు, ఈరన్న, ఎల్ ఐ సి రాజు, చింతమాను రవికుమార్, ఈగల్ టీం సిబ్బంది,కప్పట్రాళ్ళ గ్రామ ప్రజలు,పాఠశాల విద్యార్థులు ఉన్నారు.

## భాష్యం స్కూల్లో ఘనంగా మెగా పేరెంట్స్ డే...

విభారే న్యూస్ జూలై 10 ఎమ్మిగనూరు..పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో సీఈవో అనిల్ కుమార్ ఆదేశాల మేరకు గురువారము ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ డే ను నిర్వహింరు.ముందుగా వినాయకుడి పూజ చేసారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి పేరెంట్స్ మీటింగ్ లో సందేహాలను నివృత్తి చేసుకొవటం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపడంలో తల్లిదండ్రుల భాగం కూడా ఎంతో ఉందని చెప్పారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు కూడా తోడ్పాటు అందించాలని కోరారు.అనంతరం పేరెంట్ ఎస్సై శ్రీనివాసులకు శాలువా కప్పి సన్మానించడంతో పాటు తల్లిదండ్రులకు విద్యార్థులతో పాదాభివందనాలు చేయించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## శాకంబరిగా శ్రీ కామేశ్వరీ అమ్మవారు



--విభారెన్యూస్నంద్యాలమాప్రతినిధిజూలై10–: ఆషాఢ మాసం మహానంది క్షేత్రంలోశ్రీ కామేశ్వరీ అమ్మవారిని శాకంబ రిగా అలంకరించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో తెల్లవారుజామున నుండి అమ్మ వారికి విశేష అభిషేకం. శాఖాలంకారం చేసిగణపతి పూజ. పుణ్యాహవాచనం తో సంప్రోక్షణ చేసి అనంతరం వివిధ రకాల కూరగాయల పళ్ల తో సహస్రనామర్చన నీరాజనం మంత్రపుష్పాలతో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజే శారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు

## తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం..



విభారే న్యూస్ జూలై 10 ఎమ్మిగనూరు..మండల పరిధిలోని గువ్వల దొడ్డి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయు లు ఏ దుబ్బన్న వారి ఆధ్వర్యంలో విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు అనే కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి పిల్లవాని తల్లిదండ్రులు దృష్టిలో ప్రభుత్వ పాఠశాలలో చదివించాలన్నటువంటి ఉద్దేశంతో ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించడం జరిగింది అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని గురించి ఉపాధ్యాయుడు ఏ,పెద్ద మారెన్న,పి బాలరాజు మాట్లాడుతూ మీ పిల్లలను సక్రమంగా పాఠశాల పంపడం మీ బాధ్యతని అదేవిధంగా మీ పిల్లవాడు ప్రతిరోజు పాఠశాలలో జరిగినటువంటి ప్రతి అంశాన్ని మీరు గుర్తించాలని ఉపాధ్యాయుడు ఏ పెద్ద మారన్న పి, బాలరాజు తెలిపారు ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా సీఆర్పీఎఫ్ కన్వీనర్ లింగన్న పూర్వ విద్యార్థి విజయ్ భాస్కర్ గౌడ్ విద్యా కమిటీ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ గ్రామ పెద్దలు, విద్యార్థి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190